సాక్షి
అనకాపల్లి
శనివారం। 10। ఆగస్టు। 2024



టిప్పర్‌ను ఢీ కొట్టిన బస్సు

టిప్పర్‌ను లారస్ లేబొరేటరీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 8లో



శ్రావణలక్ష్మీ నమస్తుతే..

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ సిటీ: సర్దార్ గౌతు లచ్చన్న జయంత్యుత్సవాల పోస్టర్‌ను ఏయూ ఇన్‌చార్జి వీసీ శశి భూషణరావు శుక్రవారం ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

అనకాపల్లి: వచ్చే నెల 5న గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో అన్ని ప్రభుత్వ, ఏపీ మోడల్ స్కూల్, ఏపీఆర్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తు ఫారం అందజేయాలన్నారు. మండల పరిధిలో పనిచేయు ఉపాధ్యాయులు ఎంఈవోలకు, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి కార్యాలయానికి ఈ నెల 20వ తేదీలోపు ఇవ్వాలన్నారు.

బస్సు ప్రయాణికులను హడలెత్తించిన పాము

మాకవరపాలెం: ఆర్టీసీ బస్సులోకి ప్రవేశించిన పాము ప్రయాణికులను హడలెత్తించింది. అనకాపల్లి నుంచి నర్సీపట్నం వెళుతున్న పల్లె వెలుగు బస్సు మాకవరపాలెం పోలీస్ స్టేషన్ దాటగానే వేరొక వాహనాన్ని తప్పిస్తోంది. ఎత్తుగా ఉన్న ఆ రోడ్డుపై ఆ సమయంలో బస్సు నెమ్మదిగా వెళుతుండటంతో పక్కనే ఉన్న చెట్టు పైనుంచి ఒక పాము బస్సులోకి దూకింది. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. వారంతా కేకలు వేయడంతో వెంటనే బస్సును పక్కనే నిలిపి ప్రయాణికులను దింపేశారు. వీరిని వేరొక బస్సుల్లో ఎక్కించిన అనంతరం బస్సులో ఉన్న పామును ఓ ప్రయాణికుడు చంపివేసినట్టు స్థానికులు తెలిపారు. పామును గమనించిన వెంటనే బస్సును నిలిపివేసి ప్రయాణికులను దింపేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఫైనాన్స్ కమిషన్ సదస్సు

సాక్షి, విశాఖపట్నం : ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ 16వ ఫైనాన్స్ కమిషన్ సదస్సు విశాఖలో జరగనుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని ఐఐఎం వేదిక ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. సదస్సు ఏర్పాట్లు, నిర్వహణ పనులపై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ ఫైనాన్స్ కమిషన్ బృందం విశాఖ నగరానికి వస్తున్న సందర్భంగా అధికారులకు కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో ఐఐఎం డైరెక్టర్ చంద్రశేఖర్, డీసీపీ–1 అజిత, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

విశాఖ–బెంగళూరు స్పెషల్ రైలు పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–బెంగళూరు మధ్య గతంలో నడిచిన స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రతీ ఆదివారం విశాఖపట్నంలో బయలుదేరే విశాఖపట్నం–బెంగళూరు(08543) స్పెషల్ ఈ నెల 18 నుంచి, ప్రతీ సోమవారం బెంగళూరులో బయలుదేరే బెంగళూరు–విశాఖపట్నం(08544) స్పెషల్ ఈ నెల 19 నుంచి మళ్లీ పట్టాలెక్కనుంది.

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యం

తాటిచెట్లపాలెం: ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 15.30 గంటలు ఆలస్యంగా శుక్రవారం రాత్రి 10.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరింది. పెయిరింగ్ రైలు ఆలస్యం కారణంగా ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో ఈ రైలును రీ షెడ్యూల్ చేశారు. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్లకు చేరుకుంటుంది. ఈ రైలు శుక్రవారం రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉండగా.. శనివారం ఉదయం 10.30 గంటలకు చేరుకోవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.



ఐదు కిలో మీటర్లు నడిచి వెళ్లాలి

వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టకముందు రేషన్ బియ్యం కోసం ఐదు కిలోమీటర్ల దూరంలో గల జోగుంపేటకు వెళ్లి తెచ్చుకునే వాళ్లం. జగన్‌బాబు సీఎం అయ్యాక వ్యాన్‌తో నేరుగా మా గ్రామంలో రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఇప్పుడు చంద్రబాబు వచ్చి ఇంటింటికీ రేషన్ సరఫరా పథకం రద్దు చేస్తే మాలాంటి వృద్ధులకు మళ్లీ యాతన తప్పదు. ఈసురోమంటూ కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి.

– అచ్చియ్యమ్మ బుడ్డడపాడు గ్రామం గొలుగొండ మండలం



మళ్లీ ఇబ్బందులు తప్పవు

మా ఊరు అమలాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. మా గ్రామస్తులు రేషన్ సరకులను అమలాపురం వెళ్లి తెచ్చుకునేవారం. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక వాహనం ద్వారా మా శివారు గ్రామానికి తెచ్చి సరకులు ఇచ్చేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరఫరా పథకాన్ని రద్దుచేస్తున్నట్టు ప్రకటించింది. ఇదే జరిగితే శివారు గ్రామాలకు చెందిన వారు సరకుల కోసం చాలా ఇబ్బంది పడాలి. మళ్లీ రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోడానికి నరక యాతన పడాలి.

– సూరాకాసుల గోవిందు, మూలపర, నక్కపల్లి మండలం



పేదలపై కక్షసాధింపే

ఇంటింటికీ రేషన్ పథకం రద్దు చేయడం పేదలపై కక్షసాధింపు చర్యే. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకు తెచ్చి నిత్యావసర సరకులు పంపిణీ చేసేవారు. ఈ విధానాన్ని రద్దు చేస్తే మళ్లీ పేదలకు కష్టాలు తప్పవు. జన్మభూమి కమిటీ సభ్యులు అంటే కూటమి నేతలు కనుసన్నల్లో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు కుట్ర జరుగుతోంది.

– చెక్కా జోగిరాజు నాతవరం ఎస్సీ కాలనీ

రేషన్ బండి.. ఇక ఇంటికి రాదండి

జిల్లాలో రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు
5,41,818	374
రోడ్డున పడనునున్న వాహన నిర్వాహకులు, హెల్పర్లు	748

దేశం మెచ్చిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో ప్రకటించడంతో గిరిజనులకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలు కానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయడం ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ఐదేళ్లు ఏ కష్టం లేకుండా జిల్లావాసులకు రేషన్ అందింది. తాజాగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం మళ్లీ పాత కష్టాలను తెచ్చి పెడుతోంది. గిరిజన గ్రామాల ప్రజల పరిస్థితి మరింత దయనీయం కానుంది. 748 మంది వాహన నిర్వాహకులు, హెల్పర్లు ఉపాధి కోల్పోనున్నారు. ఈ నిర్ణయాన్ని జిల్లా వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

- ఎండీయూ వ్యవస్థకు కూటమి సర్కారు మంగళం
- వచ్చే నెల నుంచే రేషన్ డోర్ డెలివరీ రద్దు చేసే అవకాశం
- జిల్లావాసులకు మళ్లీ ఆనాటి కష్టాలే..
- గిరిజన గ్రామాలవారి పరిస్థితి మరీ దుర్భరం
- కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళితేనే సరకులు దక్కేది
- ఉపాధి కోల్పోనున్న ఆపరేటర్లు, హెల్పర్లు



సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం మరో ప్రజా వ్యతిరేక చర్యకు పూనుకుంటోంది. ఇంటింటికీ రేషన్ అందిస్తూ స్వయం శక్తితో హుందాగా జీవనం సాగిస్తున్న రేషన్ వాహనాల ఆపరేటర్లపై నిర్దాక్షిణ్యంగా వేటు వేసేందుకు సమాయత్తమవుతోంది. ప్రజల మేలు కోసం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఒక్కో సంస్కరణను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం.. తాజాగా ఇంటింటి రేషన్ పంపిణీ కార్యక్రమానికి మంగళం పాడనుంది. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో జరిగిన సమావేశంలో వచ్చే నెల నుంచి మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) వాహనాలను నిలిపివేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఎండీయూ వాహన ఆపరేటర్లు, హెల్పర్లు జీవనాధారం కోల్పోనున్నారు. రేషన్ సరుకుల కోసం వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు ప్రతి నెలా దుకాణాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు తలెత్తనున్నాయి. వైఎస్సార్‌సీపీ సర్కారు ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలు ఇంటింటికీ సరకులు అందించి, విశేష సేవలు చేశాయి. గతంలో ఒక రోజంతా పనులు మానుకొని రేషన్ కోసం అవస్థలు పడిన జనం.. ఇంటి వద్దనే సరకులు అందించడంతో ఎంతో ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఐదేళ్ల తర్వాత ఇక్కట్లు మొదలుకానున్నాయి.

రోడ్డున పడనున్న ఆపరేటర్లు, హెల్పర్లు

ప్రతి కార్డుదారుడికీ ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలన్న లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం 2021లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికీ రేషన్ అందించే ప్రక్రియ ద్వారా కార్డుదారులకు శ్రమ తగ్గడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని భావించింది. జిల్లాలో 374 మంది ఎండీయూ ఆపరేటర్లు, 374 హెల్పర్లను నియమించారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను నిలిపివేస్తే ఈ 748 మంది ఆపరేటర్లు, హెల్పర్ల కుటుంబాలు రోడ్డు పడే పరిస్థితి ఏర్పడుతుంది.

మళ్లీ నడకయాతన

'మేమేమి చేశాం పాపం.. మాకెందుకీ శాపం' అంటూ జిల్లాలో చీడికాడ, దేవరాపల్లి, వి.మాడుగుల, నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం మండలాల పరిధిలోని 300 గిరిజన గ్రామాల వారు వాపోతున్నారు. వీటిలో రేషన్ డిపోలకు కనీసం 5 కి.మీ నుంచి 10 కి.మీ దూరం గల గ్రామాలు 200కు పైమాటే. వీరంతా కూటమి ప్రభుత్వం తీసుకున్న ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ కష్టాలు గ్రహించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలకు శ్రీకారం చుట్టిందని, రాజకీయ కక్షలతో ఆ వ్యవస్థను రద్దు చేయడం తగదని వాపోతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్న సమయంలో ఐటీడీఏ పరిధిలో ఈ గ్రామాలు ఉండేవి. జిల్లాల పునర్విభజన జరిగిన తరువాత ఈ గ్రామాలు అనకాపల్లి జిల్లా పరిధిలోకి వచ్చాయి. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా దేవరాపల్లి మండలంలో 50 గిరిజన గ్రామాల్లో సుమారుగా 3 వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. చీడికాడ మండలంలో 14 గిరిజన గ్రామా ల పరిధిలో సుమారుగా 1000 కుటుంబాలు, అదే విధంగా వి.మాడుగుల మండల పరిధిలో 22 గిరి జన గ్రామాల పరిధిలో 30 కుటుంబాలు, నాతవరం మండలంలో 37 గిరిజన గ్రామాల్లో 990 కుటుంబాలు, గొలుగొండ మండలంలో 16 గిరి జన గ్రామాలు, రోలుగుంట మండల పరిధిలో 11 గిరిజన గ్రామాలు, రావికమతం మండల పరిధిలో 13 గిరిజన గ్రామాలవారు ఎండీయూ వాహనాల రద్దుతో ఇబ్బందులకు లోనయ్యే పరిస్థితి ఉంది.



గిరిజనులకు మళ్లీ తప్పని కష్టాలు

ఇంటి వద్దే రేషన్ అందజేయాలి



రేషన్ డిపో మా గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన రేషన్ కోసం వెళ్లి నానా అవస్థలు పడే వారం. దీంతో ఆ రోజు పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉండేది. జగన్ బాబు సీఎం అయ్యాక వాహనాల ద్వారా ఇంటి వద్దే సరకులు పంపిణీ చేయడంతో రేషన్ కష్టాలు తీరాయి. చంద్రబాబు ప్రభుత్వం వాహనాల ద్వారా పంపిణీని రద్దు చేసి, రేషన్ డిపోల్లో పంపిణీ చేయాలని నిర్ణయించడం దారుణం. మాలాంటి గిరిజనులు మళ్లీ నరకయాతన అనుభవించాల్సి ఉంటుంది. మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పునరాలోచించి, ఇంటి వద్దే రేషన్ అందజేయాలి.

–దోపరి దేముడమ్మ, గిరిజన మహిళ, సమ్మెద, చింతలపూడి పంచాయితీ, దేవరాపల్లి మండలం

ఎండీయూ వాహనాల తొలగింపు అన్యాయం



ఎండీయూ వాహనాల ద్వారా శివారు గ్రామాలకు సైతం వెళ్లి పక్కా తూనికతో రేషన్ సరకులు అందజేస్తున్నాం. అనారోగ్యంతో కదలలేని ప్రజలు, దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నాం. ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతారు. దీనిపైనే ఆధారపడి జీవిస్తున్న ఎండీయూ ఆపరేటర్, హెల్పర్ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది. మాకు నెలకు 18 వేలు వేతనం అందిస్తుండగా దీనిలో 3వేలు వెహికల్ ఫైనాన్స్‌కు, మరో 3 వేలు ఇంధనానికి, రూ.5 వేలు హెల్పర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన రూ.7 వేలతో కాటా రిపేరు, వాహనం నిర్వహణతో పాటు మా కుటుంబం బతకాల్సిన పరిస్థితి.

–దొగ్గ రామకృష్ణ, ఎండీయూ వాహనం, ఆపరేటర్, మారేపల్లి, దేవరాపల్లి మండలం

రేషన్ వాహనాలను తీసివేయవద్దు



ప్రతి నెలా మా ఇంటి వద్దే రేషన్ బియ్యం, ఇతర సరుకులు అందిస్తున్నారు. ప్రభుత్వం అందించే కోటా బియ్యమే మాకు దిక్కు. గతంలో మా గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో వేరే పంచాయతీలో ఉన్న రేషన్ డిపోకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆరోగ్యం సహకరించక, అంత దూరం వెళ్ల లేక ఒక్కో నెల రేషన్ వదులుకునే వారం. దీంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఇంటి దగ్గరకే ఇవ్వడంతో మాలాంటి వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఈ వాహనాలను రద్దు చేసి మాలాంటి గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం తగదు.

–దొమ్మంగి గంగమ్మ, గిరిజన మహిళ, సమ్మెద గ్రామం, దేవరాపల్లి మండలం

రోడ్డున పడ్డ బతుకులు



తెలతెలవారుతుండగా గుంపుగా వచ్చిన పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని చూసి వారంతా తల్లడిల్లిపోయారు. క్షణాల్లోనే జేసీబీలతో అక్కడ పశువుల షెడ్డు నేలమట్టం కావడం, ఫెన్సింగ్ తొలగించడంతో గగ్గోలు పెట్టారు. డీపట్టా భూములపై కన్నేసిన టీడీపీ నాయకుల ఫిర్యాదుతో ఎటువంటి ఆధారాలు చూపకుండానే అధికారులు తమ ప్రతాపం చూపారు. బుచ్చెయ్యపేట మండలంలోని కొండెంపూడి శివారు ఐయ్యరకలపాలెం గ్రామంలో ఈ బీభత్సకాండ జరిగింది. -8లో

గెలుపు కోసం కూటమి పన్నాగం

- ప్రజాస్వామ్యానికి అపహాస్యం
- విజయవాడలో అంబేద్కర్‌కు అవమానం తగదు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ



అంబేద్కర్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కూటమి పోటీ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల గెస్ట్ హౌస్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి 600 ఓట్లు ఉండగా, కూటమికి కేవలం 200 ఓట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. తక్కువ ఓట్లు కలిగిన కూటమి ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్న ఓటర్లను ప్రలోభపెట్టే యోచనతోనే కూటమి అభ్యర్థిని నిలబెడుతుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సభ్యులు ఐక్యంగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించడం ద్వారా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుక ఇద్దామని పిలుపునిచ్చారు. విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంపై దాడి యావత్ దళిత జాతికే తీరని అవమానమన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సంఘీభావం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ అంబేద్కర్ వనంలో గత రాత్రి లైట్లను ఆపివేసి శిలాఫలకం తొలగించడం అన్యాయమన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ గత రాత్రి జరిగిన ఘటనను యావత్ భారతావని ఖండించాలని సూచించారు. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్సీ డీవీవీ సూర్యనారాయణరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, మాట్లాడారు. నియోజక వర్గంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా ఉన్నత స్థాయికి ఎదగాలి

- విద్యార్థులకు కలెక్టర్ విజయ కృష్ణన్ దిశానిర్దేశం



తాటిపర్తి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులతో కలెక్టర్ విజయ కృష్ణన్

మాడుగుల/చోడవరం: నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం కాసేపు విద్యార్థినీ విద్యార్థులతో కులాసాగా గడిపారు. ఆమె తొలుత మాడుగుల మండలంలోని తాటిపర్తి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థినుల థింసా నృత్యాన్ని కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. వారి ప్రతిభకు ముగ్ధురాలై వారితో ఫొటో దిగారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను చూసి ప్రశంసించారు. చదువు ఎలా సాగుతోంది.. భోజనం బాగుందా.. అని వారిని ఆరా తీశారు. గిరిజన ప్రాంతం నుంచి వచ్చినా సంకల్పబలంతో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. అక్కడి నుంచి తిరిగివస్తూ చోడవరం (గాంధీగ్రామం) ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో క్రీడాకారులను పలకరించారు. అక్కడ వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులతో మాట్లాడారు. క్రీడల్లో యువత మరింతగా రాణించాలని, అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. హైస్కూల్ గ్రౌండ్‌ను పరిశీలించి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రీడా మైదానం విస్తీర్ణం, ఆవరణలో ఉన్న హైస్కూల్, పాలిటెక్నిక్ కాలేజీ, డిగ్రీ, పీజీ కళాశాలల వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రీడలపై యువతకు మరింత శిక్షణ ఇవ్వాలని కాలేజీ పీఈటీ గోతిరెడ్డి రాంబాబును ఆదేశించారు. చోడవరం తహసీల్దార్ తిరుమలబాబు, స్పోర్ట్స్ అథారిటీ కమిటీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో క్రీడాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్

స్మృతివనంపై దాడి దళిత జాతికే అవమానం

- చంద్రబాబు, హోం మంత్రి బాధ్యత వహించాలి
- దోషులను తక్షణమే అరెస్టు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



విలేకర్లతో మాట్లాడుతున్న జోగులు తదితరులు

నక్కపల్లి: విజయవాడ నడిబొడ్డున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంపై దాడి యావత్ దళిత జాతికే తీరని అవమానమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు అన్నారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించి, అన్ని వర్గాల వారికి రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అంబేద్కర్ స్మృతివనంగా జగనన్న ప్రభుత్వం అభివృద్ధి చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా అప్పటి ప్రభుత్వానికి ఎంతో పేరు ప్ర ఖ్యాతులు వచ్చాయన్నారు. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు ఇటీవల స్మృతి వనంపై దాడి చేసి, శిలాఫలకాలను ధ్వంసం చేయడం అమానుషమన్నారు. ఇది అంబేద్కర్‌ను అవమానించడంతోపాటు, యావత్ దళిత జాతిపై దాడిగా భావిస్తున్నట్టు చెప్పారు. లైట్లు ఆర్పివేసి ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడిన వారికి టీడీపీ నాయకులు అండదండలు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు దోషులను అరెస్టు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త సంస్కృతికి తెరతీసిందని, రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా గత ప్రభుత్వాలు నిర్మించిన భవనాలు కూల్చడం శిలాఫలకాలు ధ్వంసం చేయడం వంటి హేయమైన చర్యలకు పాల్పడుతోందని చెప్పారు. కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్‌ను కూడా అవమానించడానికి వెనుకాడడంలేదంటే టీడీపీ నాయకులు ఏస్థాయికి దిగ జారిపోయారో అర్థమవుతోందన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి అంతమాత్రాన గత ప్రభుత్వాలకు సంబంధించిన అభివృద్ధి పనులు మాయం చేయాలనుకోవడం దారుణమన్నారు. సహనానికి కూడా హద్దు ఉంటుందని, తిరుగుబాటు మొదలయితే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. శాంతియుత వాతావరణంలో పోరాటం చేయాలని మా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం వల్లే తామంతా సహనాన్ని పాటిస్తున్నామన్నారు.దళిత వర్గానికి చెందిన హోం మంత్రి తక్షణమే స్పందించి అంబేద్కర్ స్మృతివనంలో శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కోటవురట్ల వైస్ ఎంపీపీ దత్తుడు సీతబాబు, సీనియర్ నాయకుడు ధనిశెట్టి బాబూరావు, సర్పంచ్‌లు తళ్ల బార్గవ్, సురేష్‌వర్మ, వైస్ ఎంపీపీ ధనిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మలేరియా కాంట్రాక్టు కార్మికులను తొలగించడం తగదు



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులతో కాంట్రాక్టు కార్మికులు

అనకాపల్లి: స్థానిక జోనల్ కార్యాలయం మలేరియా విభాగంలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న స్ప్రేయింగ్ కార్మికులను వ్యక్తిగత పోలీసు కేసుల కారణంగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని జీవీఎంసీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు అన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక జోనల్ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పోస్టులను మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ కోదండరాం అమ్ముకోవాలని ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమై జీవీఎంసీ సీఎంవోను సంప్రదించగా విధుల్లో తీసుకోవద్దని కమిషనర్ కార్యాలయం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదని చెప్పారన్నారు. నలుగురు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో మిగిలిన కార్మికులతో కార్యాలయం వద్ద ధర్నాలు చేస్తామని ఆయన తెలిపారు. యూనియన్ కార్యదర్శి ఎన్. అజయ్, సభ్యులు బొమ్మల రాము, సంతోష్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఘర్షణ.. యువకుడికి గాయాలు



గాయపడిన కార్తీక్

సీతమ్మధార (విశాఖ): ఓ వివాహ ఊరేగింపు వేడుకలో జరిగిన గొడవలో ఓ యువకుడు గాయపడ్డాడు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేటలోని యాదవ ఫంక్షన్ హాలులో శుక్రవారం వివాహ వేడుక నిమిత్తం ఊరేగింపు నిర్వహించారు. వధువుది దొండపర్తి కాగా, వరుడిది సీతంపేట. శుక్రవారం రాత్రి ఊరేగింపు సందర్భంగా ఇరు కుటుంబీకులు, స్నేహితులు డ్యాన్స్ చేశారు. మార్గంమధ్యలో కొందరు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. వారిలో దొండపర్తికి చెందిన కార్తీక్(22) తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ద్వారకా సీఐ రమేష్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘర్షణకు కారణమైన దొండపర్తికి చెందిన శ్రీనివాస్ అలియాస్ ఇత్తిడి చెంబును అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధరేంద్ర తెలిపారు.

రోడ్డున పడ్డ బతుకులు

సమయం తెల్లవారుజాము ఆరు గంటలు... అప్పుడే పల్లె ప్రజలు నిద్రలో నుంచి లేస్తున్నారు.. ఇంతలో పచ్చని పొలాల్లోకి సాయుధ దండులా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వస్తుంటే... వారంతా ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. క్షణాల్లోనే జేసీబీలతో అక్కడ పశువుల షెడ్డు నేలమట్టం కావడం, ఫెన్సింగ్ తొలగించారు. ఈ హఠాత్తు పరిణామానికి సాగు రైతులు ఒక్కసారిగా గగ్గోలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఆధారాలు చూపకుండా పేదల రైతుల భూములపై కన్నేసిన టీడీపీ నాయకుల ఫిర్యాదుతో ఈ విధంగా తమ ప్రతాపం చూపించారు. అదేదో సినిమాలో విలన్ వందమందితో వచ్చి బెదిరించి దౌర్జన్యంగా సంపద లాగేసుకున్నట్లుగా అవలంబించిన తీరును పలువురు ఆక్షేపిస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో శుక్రవారం జరిగిన ఘటన ఇది.

- డీపట్టా భూములపై కన్నేసిన టీడీపీ నేతలు
- వారి ఫిర్యాదుతో షెడ్డు, ఫెన్సింగ్ తొలగింపు
- 25 మంది పోలీస్ బందోబస్తుతో స్వాధీనం
- ప్రభుత్వ భూమిగా బోర్డుల ఏర్పాటు
- 7 ఏళ్ల క్రితమే డీ పట్టాలు రద్దు చేశామంటున్న అధికారులు
- నేటికీ భూ రికార్డుల్లో లబ్ధిదారుల పేర్లు



ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: అధికార పార్టీ నేతలు చెప్పిందే వేదం అన్నట్టుగా రెవెన్యూ అధికారులు మండలంలోని కొండెంపూడి శివారు ఐయ్యరకలపాలెం గ్రామంలో పేదల భూములు లాక్కున్నారు. ఇక్కడ 1986లో కడియాల రామారావుకు సర్వే నంబర్ 5–1లో 4.50 ఎకరాలకు, 1990లో కడియాల సాంబశివరావుకు సర్వే నంబర్ 5–2లో 2.35 ఎకరాలకు ప్రభుత్వం డీఫారం పట్టాలు అందించింది. కొన్నాళ్ల పాటు వీరు సాగు చేసుకుని, అనారోగ్యంతో స్థానిక గ్రామ రైతులు లంక ప్రసాద్, లంక రామకృష్ణ, పినపాత్రుని వెంకటరమణ, గొల్లవిల్లి ఈశ్వరరావు, సోమిరెడ్డి రాములుకు అప్పగించారు. వీరి సాగు చేస్తూ పదేళ్లుగా ఫలసాయం సగం అందిస్తూ వస్తున్నారు.

డీపట్టాలపై కన్నేసిన టీడీపీ నాయకులు...

కూటమి అధికారంలోకి రాగానే స్థానిక టీడీపీ నాయకులు సదరు వ్యక్తుల భూములపై కన్నేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వాటిని దక్కించుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. డీపట్టాదారులు సాగు రైతులకు విక్రయించారని ఆరోపిస్తూ.. వాటిపై ఆధారాలు చూపకుండానే బుచ్చెయ్యపేట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొన్నేళ్ల క్రితం మృతి చెందిన రామారావు భార్య రాజ్యలక్ష్మి, మరో బాధిత రైతు సాంబశివరావు వారం రోజుల క్రితం డీపట్టాలు చూపించారు. అయినప్పటికీ టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో సాగు చేస్తున్న ఐదుగురు రైతులు ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం నోటీసులిచ్చారు. ఒక్క రోజు గడవక ముందే బుచ్చెయ్యపేట, కొత్తకోట ఎస్ఐల ఆధ్వర్యంలో 25 మంది పోలీసులు, 20 మంది వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది దండులా వాలిపోయారు. సాగు రైతులను బలవంతంగా భూముల నుంచి పంపించి జేసీబీతో పశువుల షెడ్డును, ఫెన్సింగ్ తొలగించారు. నిరుపేదలమని వేడుకున్నా కనకరించకుండా తోసేయడంపై సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ అరుణ్ చంద్రను వివరణ కోరగా, పట్టాలు పొందిన రైతులు భూములు అమ్మినట్లు స్థానికుల ఫిర్యాదు మేరకు వాటిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అయితే బాధిత రైతుల డీ పట్టాలు ఏడేళ్ల క్రితమే రద్దు చేశామని అధికారులు చెబుతుండగా, నేటికీ భూ రికార్డుల్లో వారి పేర్లు ఉండటం గమనార్హం.

రైతులంటే దేశ ద్రోహులా..



నాకు భూముల్లేవు. డీపట్టాదారు కడియాల రామారావుకు ఆరోగ్యం బాగోకపోవడంతో ఆయన భూమిలోనే పంటలు పండించి సగం వాటా ఫలసాయం ఇస్తున్నాను. ఇప్పుడు ప్రభుత్వ భూమి అని 50 మంది వరకు రెవెన్యూ, పోలీసులు వచ్చి మా భూమిలో పశువుల షెడ్డు, పెన్సింగ్ తొలగించి నష్టం కలిగించారు. రైతులంటే దేశ ద్రోహులా కనిపిస్తున్నారా? అంత మంది అధికారులు, పోలీసులు వచ్చి దౌర్జన్యం చేసి భయపెట్టారు. మమ్మల్ని భూముల నుంచి వెల్లగొట్టడాన్ని తట్టుకోలేకపోతున్నాను. షెడ్డు తొలగించడంతో నా పశువులు ఎండలో ఉన్నాయి.

– గొల్లవిల్లి ఈశ్వరరావు, సాగు రైతు

పట్టాలున్నా స్వాధీనం చేసుకోవడం దుర్మార్గం



ఎటువంటి ఆధారాలు చూపకుండా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి మేము సాగు చేస్తున్న భూములపై దౌర్జన్యం చేయడం దారుణం. మండలంలో ఎంతో మంది బడాబాబులు డీపట్టా భూములు కొనుగోలు చేసి సాగు చేస్తుంటే, వారి జోలికెళ్లడం లేదు. మాలాంటి చిన్న రైతులపై మీ ప్రతాపం చూపడం సరికాదు. మాకు భూములు అప్పగించిన రైతుల పేరున పట్టాలుండి ఆన్‌లైన్లో వారి పేర్లు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వ భూమి అని బోర్డులు ఎలా పాతి పెడతారు. జిల్లా అధికారులు న్యాయం చేయాలి.

– లంక ప్రసాద్, సాగు రైతు

12 మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి : మద్యం క్వార్టర్ బ్యాటిల్స్ తరలిస్తున్న మండలంలో కోడూరు గ్రామానికి చెందిన సేనాపతి రమణ వద్ద నుంచి 12 క్వార్టర్ బ్యాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఏఎస్ఐ ఆర్.లత శుక్రవారం చెప్పారు. ఏఎస్ఐ కథనం మేరకు వివరాలు...పట్టణంలో డీ మార్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుంచి కోడూరు ద్విచక్ర వాహనంపై వెళ్లుతున్న రమణ వద్ద నుంచి 12 బాటిల్స్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ చెప్పారు.

తాండవ నల్లకొండమ్మ తల్లి ఆలయంలో చోరీ

- నాతవరం రిలయన్స్ టవర్ వద్ద బ్యాటరీలు మాయం



చోరీ జరిగిన అమ్మవారి ఆలయం

నాతవరం : తాండవ రిజర్వాయర్ గట్టు దిగువనున్న నల్లకొండమ్మ తల్లి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని దొంగిలించారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటిలో రికార్డు కాకుండా ఆలయంలో హుండీని ఎత్తుకుపోయి దాంట్లో నగదు, వస్తువులను దోచుకుని హుండీని ఆలయ సమీపంలో తుప్పల్లో పడేశారు. శ్రావణ శుక్రవారం ఉదయం భక్తులు ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి వెళ్లగా ఈ విషయం తెలిసింది. వెంటనే ఆలయ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు నాతవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే విధంగా నాతవరం గ్రామంలో గల రిలయన్స్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన బ్యాటరీలు, ఇతర సామాగ్రిని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని వైఎస్సార్‌సీపీ మహిళా సమాఖ్య మండల శాఖ అధ్యక్షురాలు పాలుపర్తి రాధ తెలిపారు. ఈ విషయంపై రిలయన్స్ కంపెనీ యాజయాన్యానికి కూడా ఫిర్యాదు చేశామన్నారు. గతంలో ఎప్పుడూ సెల్ టవర్ వద్ద దొంగతనాలు జరగలేదని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అసిస్టెంట్ మలేరియా అధికారి నాయుడు



హరిపాలెం పీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి అసిస్టెంట్ మలేరియా అధికారి పి.జె.ఎం.ఆర్.పి.నాయుడు సూచించారు.అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న అవగాహన కార్యక్రమాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అందలాపల్లిలో నిర్వహించిన అవగాహన శిబిరంలో మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు రాకుండా ఉండాలంటే దోమలను నిర్మూలించాలన్నారు. దోమలకు ఆవాసంగా ఉండే నీటి నిల్వలు పరిసర ప్రాంతాల్లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కలుషిత నీరు తాగకుండా జాగ్రత్త పడాలని అన్నారు. వేడి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా హరిపాలెం పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, ల్యాబ్ టెక్నీషియన్ గణేశ్, వైద్య సిబ్బంది లక్ష్మి, రమ్య, రమణ పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారుల తీరుపై గిరిజనుల ఆగ్రహం



నగరంపాలెం వద్ద నిరసన చేపట్టిన గిరిజనులు

దేవరాపల్లి : అనంతగిరి మండల పరిధిలోని సరియా జలపాతం సమీపంలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి సర్వే నిమిత్తం అదాని కంపెనీ ప్రతినిధులతో కలిసి ఫారెస్టు అధికారులు వస్తున్నట్టు ముందస్తు సమాచారంతో దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ పరిధిలోని నగరంపాలెం వద్ద గిరిజనులు శుక్రవారం నిరసనకు దిగారు. గిరిజనుల బతుకులను నాశనం చేసే ఈ ప్రాజెక్టును ప్రాణాలకు తెగించి మరీ అడ్డుకొని తీరుతామన్నారు. అయితే గిరిజనుల ఆందోళన విషయాన్ని తెలుసుకున్న ఫారెస్టు అధికారులు, అదాని కంపెనీ ప్రతినిధులు దేవరాపల్లి రేంజర్ కార్యాలయం నుంచి వెను దిరిగారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర తెలిపారు. ఇది వరకే అదాని కంపెనీకి చెందిన ప్రతినిధులు ఈ ప్రాంతంలో రహస్య సర్వే చేసేందుకు ప్రయత్నించగా గిరిజనులు అడ్డుకొని వెనక్కి పంపారన్నారు. అటవీశాఖ అధికారుల అనుమతితో సర్వే చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనైనా అడ్డుకుంటామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన ఫారెస్టు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అనకాపల్లి : తన భార్య కనిపించడం లేదని పట్టణ పోలీసులకు శుక్రవారం ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై ఏఎస్ఐ ఆర్.లత తెలిపిన వివరాలివి. కోటవురట్ల మండలం అన్నవరం గ్రామానికి చెందిన గోవింద్, భార్య అనంతలక్ష్మి, ఇద్దరు పిల్లలు కుటుంబ సమేతంగా కొంత కాలంగా అనకాపల్లి నర్సింగరావుపేట గ్రామంలో నివసిస్తున్నారు. గోవింద్ వృత్తిరిత్యా తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. గత నెల 24వ తేదీన అనంతలక్ష్మి అలిగి ఇద్దరు పిల్లలను ఇంట్లో వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయిందని, గోవింద్ చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

టిప్పర్‌ని ఢీ కొట్టిన ప్రైవేటు బస్సు

- ప్రమాదంలో ఒకరు మృతి
- 12 మందికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన కార్మికులను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు రొంగలి రాము



రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన లారస్ ల్యాబ్ పరిశ్రమ బస్సు

రాంబిల్లి (యలమంచిలి): లారస్ పరిశ్రమకు చెందిన బస్సు డ్రైవర్ బస్సును నిర్లక్ష్యంగా నడిపి ఆగివున్న టిప్పర్ లారీని అతివేగంగా ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు మరణించగా మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం పరిధిలో ఉన్న లారస్ ల్యాబొరేటరీ పరిశ్రమ యూనిట్ 4 కు చెందిన బస్సు ఎస్.రాయవరం గ్రామం నుంచి మధ్యాహ్నం బీ షిఫ్ట్ విధులకు వెళుతున్న ఉద్యోగులను తీసుకువెళుతూ స్థానిక ఎస్ఈజెడ్ నిర్వాసిత కాలనీ సమీపంలో లంక ధర్మవరం గ్రామం వద్ద రాంబిల్లి మండలానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన మరమ్మతుల నిమిత్తం ఆగి ఉన్న టిప్పర్ లారీని వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో యలమంచిలి మండలం తురంగలపాలెం గ్రామానికి చెందిన బస్సు క్లీనర్ పెంటకోట రమణ తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో 12 మంది కార్మికులు, ఉద్యోగులు గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు బాధితుల బంధువులు అచ్చుతాపురం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు, పోలీసులు చెబుతున్నారు. రాంబిల్లి నేవల్ బేస్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై జరిగిన ఈ ప్రమాదం వల్ల బస్సు రోడ్డుకు అడ్డంగా ఉండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అటుగా వివిధ పరిశ్రమలకు, గ్రామాలకు వాహనాలపై రాకపోకలు సాగించేవారు ఇబ్బందులకు గురయ్యారు. ప్రమాదంలో మృతి చెందిన క్లీనర్ రమణ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ప్రమాదంపై పూర్తి విచారణ చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

బస్సు ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు, తీవ్రంగా గాయపడిన కార్మికులను లారస్ పరిశ్రమ యాజమాన్యం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. బస్సు ప్రమాదంలో మృతుడి కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని, తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించి వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా ట్రావెల్ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయన్నారు ప్రమాదంపై సమగ్రంగా విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సామాన్య ప్రజల నోటిలో మట్టికొట్టిన మోదీ ప్రభుత్వం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలియజేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనకాపల్లి: మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చి, సామాన్య ప్రజల నోటిలో మట్టి కొట్టిందని కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు అన్నారు. క్విట్ కార్పొరేట్, సేవ్ ఇండియా నినాదంతో స్థానిక నెహ్రూచౌక్ వద్ద కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 9న భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారిని ఈ దేశం నుంచి తరిమి కొట్టేందుకు గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చారని చెప్పారు. నేడు బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నందున అందుకు నిరసనగా క్విట్ కార్పొరేట్– సేవ్ ఇండియా అంటూ ప్రజలు నినదిస్తున్నారని తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్లో సంపన్నులకు రాయితీలు ఇచ్చి సామాన్య ప్రజలపై వేల కోట్ల రూపాయలు భారం మోపారని చెప్పారు. విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల సబ్సిడీల్లో కోత పెట్టారని, సమగ్ర శిశు సంక్షేమ శాఖకి రూ. 300 కోట్లు తగ్గించారని , గ్రామీణ ఉపాధి హామీ జాబు కార్డులు 35 లక్షలు రద్దు చేశారని, ఉపాధి హామీకి నిధులు కోత పెట్టారని, కార్పొరేట్ కంపెనీలకి లాభాలు కలిగించేలా నూతన విధానాల్ని అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించడం ద్వారా కార్పొరేట్లకు అటవీ సంపదను కట్టబెట్టాలని చూస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దొరబాబు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ బాలు గాడి, కౌలు రైతు సంఘం కార్యదర్శి సదాశివ, ఏఐటీయుసీ నాయకులు వై.ఎన్.భద్రం తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

- గ్రామీణ యువజన మందిరం 60 వసంతోత్సవాలు
- నందీశ్వర తులసీ వేదికపై ప్రదర్శనలు
- విజయవంతం చేయాలని కరపత్రాల ఆవిష్కరణ



ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : గ్రామీణ యువజన మందిరం 60 వసంతోత్సవాల్లో భాగంగా ఈ నెల 11 నుంచి 15 వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు యువజన మందిరం అధ్యక్షులు ఆడారి గంగమహేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువజన మందిరం వసంతోత్సవాల సందర్భంగా కళాకారులను ప్రోత్సహించేందుకు నాటిక పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నందీశ్వర కళా ప్రాంగణం తులసీ కళావేదికపై జరిగే ప్రదర్శనలను విజయవంతం చేయాలన్నారు. 11వ తేదీన 'రాత్రి రాత', 9 గంటలకు 'దానానికి దారులెన్నో' నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే 13వ తేదీన రాత్రి 7గంటలకు విజయవాడ మైత్రి కళానిలయం వారి బంధం నాటిక, అదే రోజు రాత్రి 9.30 గంటలకు విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. 14న రాత్రి 7 గంటలకు గుంటూరుకు చెందిన శ్రీ గణేష్ ఆర్ట్స్ వారి 'తొక్క తీశారు', రాత్రి 9 గంటలకు పెందుర్తి నటరాజ డ్రమేటిక్ అసోసియేషన్ వారి 'శిథిలజీవి' నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 15వ తేదీన వసంతోత్సవ ముగింపులో భాగంగా రాత్రి 8.30 గంటలకు గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'మూల్యం' నాటిక ప్రదర్శిస్తారన్నారు. ఆయా ప్రదర్శనలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన మందిర ఉపాధ్యక్షుడు దాడి అప్పలనాయుడు, ఎ.వి. సత్యనారాయణ, బొడ్డేడ అప్పలనాయుడు, కె.వి.ఎస్ అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలపై కూటమి నేతల కన్ను

- సర్వే నంబర్ 101లో 5.57 ఎకరాల కబ్జాకు యత్నం
- సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: పట్టణ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాలు చేసేందుకు కొంతమంది రాజకీయనేతలు పాములు కదుపుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదురుగా సర్వే నంబర్.101లో 5.57 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొంతమంది నేతలు ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్101లో ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా జీవీఎంసీ రెవెన్యూ, ఎన్టీఆర్ ఆస్పత్రి అధికారులు, స్థానిక ప్రజలు అడ్డుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించకుండా నాయకులు ప్రభుత్వ స్థలాలపై కన్నేశారని ఆయన ఆరోపించారు. కబ్జాలు పెరిగిపోతున్నాయని, విశాఖ శ్రీరామచంద్రస్వామి ఆలయానికి చెందిన దేవదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తును ధర్నాలు చేసి నిలుపుదల చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, కాళ్ల తేలయ్యబాబు, పెంటకోట శ్రీనివాసరావు, బి.నూక అప్పారావు, జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

REALESTATE

■ విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో అగ్రికల్చర్ ల్యాండ్స్ పంచాయతీ వుడా ప్లాట్స్ ఇల్లులు ప్రాపర్టీ ఏదైనా కొనాలన్నా, అమ్మాలనాన్న సంప్రదించండి. ఫోన్: 91542 33332 [V-791084]

FLAT FOR SALE

■ 2560 Sft. Each 5 floors N/F, 80 Sqyds UDS, 3 Moths Ready to occupy. 2 Car Parkings, Prime Area RK Beach Road, Panduranga Puram. Ph : 89787 63496, 91103 57662 [V- 6527]

■ Ready to Occupy 2 BHK 1030 Sft East & West Facing Flats for Sale & Pollutions Free zone in Highway Facing Layout at Tagarapuvalasa ✆ 9866746418 [G-2135]

■ Vizag : E/F, GF, 3 BHK (1380 Sft.) Flat, Gated at Kancharapalem & N/F, 2 BHK (900 S.ft.) Flat, Near BRTS Sujatha Nagar Bus Stop. Cont: ✆ 97013 47602 / 93929 12051 [B-4022]

LAND FOR SALE

■ విజయవాడ to హైదరాబాద్ హైవే ఫేసింగ్ కమర్షియల్ ల్యాండ్ 4 ఎకరాలు కలదు. ఐకానిక్ బ్రిడ్జికి 300 మీటర్స్‌లో కోర్ కేపిటల్ అమరావతికి 7కి.మీ దగ్గరలో సంప్ర: 93477 56501. [N-1263943]

■ 1.65 acres of Land on Sale at Neppalli, A.P.2KM from Davuluru toll, 600 m from NH 65,4KM from Kankipadu ✆ 83099 87010 [B-773801]

R/E WANTED

■ ప్రముఖ విద్యా సంస్థకు కొమ్మాది మరియు రాజుల తాళ్ళవలస హైవేకు దగ్గరలో 1.50 (ఎకర యాభై సెంట్లు) స్థలము కలిగి 40,000 Sft. బిల్డింగ్ కట్టి అద్దెకు ఇవ్వుటకు ఆసక్తిగలవారు ఈ క్రింది సెంబరును సంప్ర. ✆ 89191 27061 [V- 786837]

PLOT FOR SALE

■ 100% బ్యాంక్‌లోన్‌తో పెందుర్తి, పినగాడి దగ్గరలో 3 నేషనల్ హైవేస్ మధ్యలో 68 ఎకరాల అప్రూవ్డ్ లే అవుట్‌లో గజం @ 8599/- & ఇండిపెండెంట్ 2BHK హౌస్ @ 36 L. డూప్లెక్స్ 3BHK @ 45L మాత్రమే. ✆ 98859 57795. [V-3169]

■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ॥గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 73372 42575 [B-56]

Services

SERVICES

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-269]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12256]

Wanted

■ Wanted Immediately Freshers Minimum Qualification 10th With Two Wheeler, Earning Opportunity Upto 20,000/- to 30,000. Ph: 7416230522, 9100023737 [HA-98149]

■ Join as LIC Agent / Advisor మీ సంపాదన మీ ఇష్టం.. మీ చేతిలోనే.. అది LIC ఏజెంట్‌గానే సాధ్యం.. ఒకసారి ప్రయత్నించి చూడండి. నిరుద్యోగులు, మహిళలు, రిటైర్డైనవారు మి॥ 10th పాసైనవుంటే చాలు. బొమ్మిడి సత్యనారాయణ. 98480 17499 [V- 2644]

■ రిసెప్షనిస్ట్ (ఫిమేల్), టెలీకాలర్స్ (ఫిమేల్) & మార్కెటింగ్ సిబ్బంది (M/F) ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు కావలెను. సంప్ర : 99850 55770 [V- 3170]

■ ప్రముఖ హెల్త్ కంపెనీలో జిల్లా వ్యాప్తంగా పనిచేయుటకు టీం లీడర్స్ కావలెను. నో సేల్స్, నో టార్గెట్స్, ప్రతి నెల 15 వేలు నుంచి 30 వేలు వరకు సంపాదించవచ్చు. పూర్తి వివరాలకు కాల్ : 89782 49141 [V- 120105]

■ ఫర్నిచర్ షోరూమ్ కొరకు సేల్స్‌మెన్స్ & గర్ల్స్ (Up to 20,000/-) డ్రైవర్ (16000/–), హెల్పర్స్ (13000) కావలెను. ఫోన్ : 77299 49079. [V- 12467]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185276]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపనికి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 [H-796188]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

లారస్ బస్సు ప్రమాదంపై విచారణ జరపాలి

అనకాపల్లి: లారస్ బస్సు ప్రమాదంలో యలమంచిలి మండలం తురంగలపాలెం గ్రామానికి చెందిన పెంటకోట రమణ మృతి చెందాడని, మృతిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు, ఈ ఘటనపై విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ ప్రమాదంలో గాయపడిన 12 మందికి మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు. ఎస్.రాయవరం నుంచి లారస్ బి-4 షిఫ్ట్ విధులకు హాజరవుతున్న ఉద్యోగులను తరలిస్తున్న బస్సు ఎస్ఈజెడ్ కాలనీ వద్ద ప్రమాదానికి గురైందని తెలిపారు. తరుచూ ఇటువంటి ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యధోరణి అవలంభిస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ బస్సుల్లో పనిచేసే డ్రైవర్లకు ఏడాదికి రెండు సార్లు శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. కార్మికులకు భద్రతపై పరిశ్రమల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పి.వి.వి.ఎం.మోహన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రభుత్వశాఖ అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో సోప్ బ్యాంక్



సోప్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం ఆచంట రవి

కశింకోట: ప్రతి రోజూ భోజనానికి ముందు విద్యార్థులు తమ చేతులను తప్పనిసరిగా శుభ్రపరచుకోవాలని హెచ్‌ఎం ఆచంట రవి సూచించారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో శుక్రవారం విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడం కోసం సోప్ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, బొడ్డేడ అప్పారావు, పీడీ ప్రభాకరరావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 32 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	3,950	3,950
మూడోరకం	3,350	3,350

అనకాపల్లి సినిమాలు

పాగల్ విఎస్ కాదల్	రాజా (ఉదయం, మొదటి ఆట)
సంఘర్షణ	రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
కల్కి 2898 ఏడీ	సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	పర్తిసాయి
డార్లింగ్	షిర్డిసాయి
తిరగబడరస్వామి	వెంకటేశ్వర
సూపర్ డీలక్స్	శ్రీసత్య
భవనమ్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 74 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-4 యూనిట్లు, బి పాజిటివ్-22 యూనిట్లు, ఒ పాజిటివ్-46 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే





పూజలందుకున్న సతకంపట్టు కనకదుర్గ, దిబ్బవీధిలో లక్ష్మీ ఆండాళ్ అమ్మవారు, సత్యనారాయణపురంలో కనకదుర్గ

- ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



కశింకోటలోని కవచాలంకృత ధ్యాన వేంకటేశ్వరస్వామి

అనకాపల్లి: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణం, మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలను ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచితంగా జరిపించారు.



కశింకోటలోని శివాలయంలో కుంకుమార్చనలు

- గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- గవరపాలెం దిబ్బవీధిలో శ్రీ వరహాలక్ష్మీ నృసింహ స్వామివారి ఆలయంలో శ్రీ లక్ష్మీ ఆండాళ్ అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు.
- మండలంలో సత్యనారాయణపురంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని తెల్లవారు జామునుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కోటి కుంకుమార్చన కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు తెలిపారు.



నూకాంబిక అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్) అమ్మవారి విగ్రహం

కశింకోట: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా స్థానిక శివాలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక గవరపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఇక్కడి జాతీయ రహదారి వద్ద ఉన్న కనక దుర్గ ఆలయంలో అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు లలిత సహస్ర నామ పారాయణం చేసి, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

- కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని కవచాలంకృతులను చేసి, విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామ చరణాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోటీ పరీక్షలపై దృష్టి పెట్టండి

యలమంచిలి రూరల్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మట్లాడారు. సాధారణ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన తర్వాత గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన లక్ష్యం నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. డిగ్రీ అర్హతతో ఏపీ పోటీ పరీక్షలు ఉన్నాయి. వాటికి అవసరమైన జనరల్ స్టడీస్, హిస్టరీ, కరెంట్ అఫైర్స్, ఎకనమిక్స్, పాలిటిక్స్ వంటి సబ్జెక్టులపై నిపుణులైన అధ్యాపకులతో రెండు నెలలు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. వీటి కోసం 70 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఈ తరగతులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ వెంకన్న, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలుకు పూర్వ విద్యార్థుల వితరణ



మునగపాక హైస్కూల్లో సరస్వతి విద్యా వేదిక ప్రారంభోత్సవంలో పూర్వ విద్యార్థులు

మునగపాక : మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు హైస్కూల్‌కు అవసరమయ్యే విద్యా వేదిక నిర్మించేందుకు ముందుకొచ్చారు. రూ.2 లక్షల మేర నగదు పోగు చేసి సరస్వతి విద్యావేదికను నిర్మించారు. శుక్రవారం రాంబిల్లి ఎంఈవో సూర్యారావు, పూర్వ విద్యార్థులంతా కలిసి విద్యావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థులు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు తమవంతు సాయం అందించేందుకు ముందుకొచ్చామని విద్యార్థులు ఇష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనా ప్రమాణాలు పెంచాలి



పంచదార్ల హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు



పంచదార్ల హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

రాంబిల్లి (యలమంచిలి) : విద్యార్థులకు అర్థవంతమైన రీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు అన్నారు. శుక్రవారం రాంబిల్లి మండలం పంచదార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేసి, విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబాట్టారు.

విద్యార్థులకు విపులంగా వివరించి బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా విద్యార్థుల నోట్ పుస్తకాలను తరగతి ఉపాధ్యాయుడు పరిశీలించాలని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి, ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి పాఠశాలలో పారిశుధ్యం చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో వివిధ తరగతుల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలని సూచించారు.

పూడిమడక రోడ్డులో లారీ బోల్తా



ప్రమాదానికి గురైన లారీ

మునగపాక : మండలంలోని గంగాదేవిపేట దరి పూడిమడక రోడ్డులో లారీ బోల్తాపడింది. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపునకు యాస్‌తో కూడిన లారీ శుక్రవారం సాయంత్రం వెళుతోంది. మునగపాక మండలం గందాదేవిపేట దగ్గరకు వెళ్లేసరికి లారీ టైర్ పంక్చర్ అయింది. దీంతో రోడ్డును ఆనుకొని ఉన్న సాగునీటి కాలువలో లారీ బోల్తా పడింది. డ్రైవర్‌కు ఈ సంఘటనలో గాయాలు కావడంతో అతనిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. సంఘటన జరిగిన సమయంలో ఈ మార్గంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పినట్టయింది. అయితే లారీ బోల్తా పడిన సంఘటనలో విద్యుత్ స్తంభం దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఏఈ గోపీ సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అలాగే విషయం తెలుసుకున్న ఏఎస్ఐ రామకృష్ణ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



బోదిగల్లంలో మానవ హారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నక్కపల్లి : ప్రస్తుతం గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పెదబోదిగల్లం గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో వైరల్ జ్వరాలు, అతిసార, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. ముందుగా స్వీయ రక్షణ కార్యక్రమాలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. నిల్వ ఉన్న పదార్థాలు తినడం వల్ల దోమలు ఎక్కువగా వ్యాపించడం వల్ల టైఫాయిడ్, ఫైలేరియా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాగి పారేసిన కొబ్బరి బొండాలు పరిసరాల చుట్టుపక్కల ఉండకుండా చూసుకోవాలన్నారు. అతిసార, జ్వరం, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వండిన పదార్థాలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులతో మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు.

విత్తనశుద్ధితో తెగుళ్లకు చెక్...

ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టపడి పనిచేస్తారు. అయితే ప్రకృతి విలయతాండవం చేయడమో లేకుంటే పంట తెగుళ్ల బారిన పడడమో వంటి కారణాలతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రధానంగా వరిలో తెగుళ్ల బెడద లేకుండా రైతులు విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకుంటే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

- పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన
- సుడోమోనాస్‌తో విత్తనశుద్ధికి అవకాశం



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మునగపాక : వ్యవసాయంలో రాణించేందుకు రైతులకు ఎప్పటికప్పుడు పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు మెరుగైన దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతుల కమతాల వద్దకు అధికారులు వచ్చి పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు అలాగే తెగుళ్లు సోకకుండా ముందస్తు చర్యలపై ఎప్పటికపుడు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా వరిలో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై నిపుణుల సూచనలు ఇలా ఉన్నాయి.

సుడోమోషన్‌తో విత్తన శుద్ధి...

ప్రతి పంట సాగులోనూ తెగుళ్ల బెడద సహజం. ప్రధానంగా వరి పంటలో తెగుళ్ల బెడదను నివారించేందుకు వ్యవసాయశాఖ విత్తనశుద్ధి కార్యక్రమం నిర్వహిస్తుంది. విత్తనం, నేల ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు విత్తనశుద్ధి దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. 30 కిలోల విత్తనాలలో 250 గ్రాముల సుడోమోషన్‌ను, 90 గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి 24 గంటల పాటు ఊరిన తర్వాత పంట పొలాల్లో జల్లాలి. తక్కువ ఖర్చుతో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని అధికారులు వివరిస్తున్నారు. గతంలో విత్తన శుద్ధి లేకుండా వరి విత్తనాలు విత్తేవారు తెగుళ్ల బెడద నుంచి తేరుకోలేకపోయేవారు. వరిలో పొడతెగులు, అగ్గి తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి ఒక్కటే మార్గం.

వరిలో యాజమాన్య పద్ధతులు...

నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చ రంగులో ఉంటే మొన త్వరగా తిరుగుతుంది. 4 నుంచి 6 ఆకులున్న నారును ఎంచుకోవాలి. పైపైన నాట్లు వేస్తే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. చదరపు మీటరుకు 33 మొనలు ఉండేలా చూసుకోవాలి.ముదురునారు నాటేటప్పుడు చదరపు మీటరుకు 44 మొనలు నాటుకోవాలి. నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వంతున బాటలు ఏర్పాటు చేసుకోవాలి. అలా చేయడం ద్వారా పైరుకు గాలి,వెలుతురు తగిలి తెగుళ్ల బెడద తగ్గుతుంది. ఎరువులు వేయడానికి అలాగే పురుగు మందులు, కలుపు మందుల పిచికారీకి కాలిబాటలు ఉపయోగకరంగా ఉంటాయి. నారుమడిలో లేత ఆకులు తెల్లగా మారితే ఇనుపలోపంగా గుర్తించి నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నబేధి, రెండు గ్రాముల నిమ్మఉప్పు కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది.

పొలంబడితో అవగాహన



పొలంబడి కార్యక్రమం ద్వారా పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో విత్తన శుద్ధి అంటే తెలిసేది కాదు. నేడు పొలాల వద్దకు అధికారులు వచ్చి విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు. తెగుళ్ల బెడద నుంచి కాపాడుకునేందుకు విత్తన శుద్ధి ఉపయోగకరంగా ఉంటుందని తెలుసుకోగలిగాం.

–యల్లపు రామసూరి, రైతు, అరబుపాలెం

మెరుగైన దిగుబడులకు సూచనలు



నారుమడుల్లో తెగుళ్లను నివారించేందుకు విత్తనశుద్ధి దోహదపడుతుంది. విత్తన శుద్ధి లేకుండా విత్తనాలు విత్తితే తెగుళ్ల బెడద పెరిగి, ఖర్చు పెరిగిపోతుంది. రైతులపై భారం లేకుండా ఉండేందుకు పొలంబడి కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అధికారుల సూచనలు పాటిస్తే మెరుగైన దిగుబడులు సొంతం.

–సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సేవాసంఘాల ప్రతినిధులు

తుమ్మపాల: క్విట్ ఇండియా ఉద్యమం వల్ల స్వాతంత్ర్య పోరాటం మరింత తీవ్ర రూపం దాల్చిందని ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు, పట్టణ న్యాయవాదులు సంఘం మాజీ అధ్యక్షుడు శేఖర్‌మంత్రి సాయివెంకట లక్ష్మణ్ అన్నారు. పట్టణంలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద క్విట్ ఇండియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది అడపా సుధాకర్, సిద్ధార్థ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం, కాంగ్రెస్ గుల శివశంకర్, డి.వి.ఎస్. కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు పరికరాలు



తుమ్మపాలలో స్టిక్ అందజేస్తున్న ఏఎన్ఎం

అనకాపల్లి: ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా పరికరాలను అందజేస్తోందని, పొందగోరేవారు తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో వైద్యులను సంప్రదించాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బి.సంగమ్ తెలిపారు. గోపాలపురం, మారేడుపూడి, తుమ్మపాల గ్రామాల్లో ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం వాకింగ్ స్టిక్స్, వాకర్, లంబారు స్పినల్ బెల్ట్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారేడుపూడిలో నలుగురికి, గోపాలపురంలో ఇద్దరికి, తుమ్మపాలలో ఒకరికి పరికరాలు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పెరటితోటల పెంపకంతో మహిళల ఆర్థికాభివృద్ధి



వాడ్రాపల్లిలో పెరటితోటల పెంపకంపై ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : పెరటితోటల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్య పేర్కొన్నారు. వాడ్రాపల్లిలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా పెరటితోటల పెంపకంపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్టు గుర్తించామన్నారు. ఇందుకోసం కూరగాయల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమయ్యే పోషకాలు అందుతాయన్నారు. పెరటితోటల పెంపకంపై నిర్వహించిన ఆడియో కాన్ఫరెన్స్‌కు మహిళలు హాజరయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com